క్లుప్తంగా

ఆస్తిపన్ను చెల్లింపు



కల్వకుర్తి టౌన్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో రాయల్ ఫంక్షన్ హాలు యజమాని అసెస్‌మెంట్ చేయించుకొని శుక్రవారం ఆస్తిపన్నును చెల్లించారు. అదేవిధంగా పాలమూరు చౌరస్తాలోని కల్వ రమేష్ భవనం, హైదరాబాద్ రోడ్డులోని ఓ పెట్రోల్‌బంక్ వారు అసెస్‌మెంట్ చేయించుకొని ఆస్తిపన్ను కట్టారు. ఇతర పలు కమర్షియల్ భవనాల యజమానులు వారి సొంతంగా అసెస్‌మెంట్ చేయించుకోవాలని మున్సిపల్ కమిషనర్ కోరారు. కార్యక్రమంలో మేనేజర్ రాజకుమారి, ఆర్‌ఐ చంద్రయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం

కల్వకుర్తిరూరల్: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానాలలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మహబూబ్‌నగర్ నుంచి ఏఐసీసీ కార్యదర్శి వంశీచందర్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ నుంచి డా మల్లురవిలను ఆశీర్వదించాలని కోరారు.

వాహనాల తనిఖీ



కోడేరు: మండలంలోని ఎత్తం, నర్సాయిపల్లి క్రాస్ రోడ్డు దగ్గర ఎస్ఐ కురుమూర్తి ఆధ్వర్యంలో శుక్రవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వాహనదారుడు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఆర్‌సీ, లైసెన్స్, తప్పక ఉండాలన్నారు. అదేవిధంగా మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పార్లమెంట్ ఎన్నికలు సందర్భంగా ఎన్నికల కోడ్ అమలులో ఉందన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తనిఖీల్లో పోలీస్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

అచ్చంపేట రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని ఒకటో వార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని కౌన్సిలర్ గౌరీ శంకర్ అన్నారు. శుక్రవారం వార్డులో శిథిలావస్థలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించి నూతన విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, విద్యుత్ ఏఈ ఆంజనేయులు సహకారంతో వార్డులో విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరి తీగలు వేలాడుతున్నాయని కాలనీవాసుల ఫిర్యాదు మేరకు విద్యుత్ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లామని పేర్కొన్నారు. విద్యుత్ అధికారులు స్పందించి శిథిలావస్థలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించి నూతన స్తంభాన్ని ఏర్పాటు చేశారన్నారు. లైన్‌మెన్ నిరంజన్, కాంట్రాక్టర్ మురళి ఉన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం



కల్వకుర్తి: నియోజకవర్గంలోని ఆమనగల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన జగన్‌ను కల్వకుర్తి కాంగ్రెస్ నాయకులు శుక్రవారం సన్మానించారు. సన్మానించిన వారిలో మాజీ సర్పంచ్ ఆనంద్‌కుమార్, సుదర్శన్ రెడ్డి, షానవాజ్, శ్రీనివాస్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, చంద్రకాంత్ రెడ్డి, రమాకాంత్, శ్రీనివాస్, శేఖర్ రెడ్డి, నాయకులు ఉన్నారు.

కేసు నమోదు

అచ్చంపేట రూరల్: మండలంలోని దుబ్బతండాకు చెందిన జవహర్ (33) కుటుంబ కలహాలతో గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శుక్రవారం అచ్చంపేట ప్రాంతీయ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు పోలీసులు మృతదేహాన్ని అందించారు. భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సిద్ధాపూర్ ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు.

ఎమ్మెల్సీని కలిసిన తరుణ్

కల్వకుర్తి టౌన్: కాంగ్రెస్ పార్టీ అనుబంధ విద్యార్థి విభాగం ఎన్ఎస్‌యూఐ జిల్లా ప్రధాన కార్యదర్శి తరుణ్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌ను శుక్రవారం కలిశారు. జిల్లా కార్యదర్శిగా నియమితులు కావటంతో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే



తెలకపల్లిలో..



కల్వకుర్తిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి: పట్టణంలోని చర్చిలో గుడ్‌ఫ్రైడే సందర్భంగా శుక్రవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయమన్నారు. క్రైస్తవులకు గుడ్ ఫ్రైడే శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట సురేందర్‌రెడ్డి, పాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

దోమలపెంట: ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయమని పాస్టర్ ఆశీర్వాదం అన్నారు. శుక్రవారం గ్రామంలోని చర్చిలో గుడ్‌ఫ్రైడే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

వెల్దండ: మండల కేంద్రంతో పాటు గుండాల, బండోనిపల్లి, రాచూర్ తదితర గ్రామాల్లో శుక్రవారం క్రైస్తవులు గుడ్‌ఫ్రైడే సందర్భంగా క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్లు గుడ్‌ఫ్రైడే విశిష్టతను వివరించారు. పాస్టర్లు తదితరులు ఉన్నారు.

తెలకపల్లి: మండల కేంద్రంలో సీజీఎం చర్చిలో చిన్నారుల నాటికలు ఆకట్టుకున్నాయి. బైబిల్ సందేశాలను పాస్టర్ గోవర్ధన్ వివరించారు. ప్రత్యేక ప్రార్థనలో క్రైస్తవులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల ఆందోళన



ఆందోళన చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

లింగాల: మండల కేంద్రంలోని సీహెచ్‌సీ ఎదుట పెండింగ్ వేతనాలను చెల్లించాలని కోరుతూ తెలంగాణ మెడికల్ కాంట్రాక్టర్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శుక్రవారం పారిశుద్ధ్య కార్మికులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి బ్రాంచ్ అధ్యక్షుడు తిర్పతయ్య మాట్లాడుతూ తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలో ఉన్న సామాజిక ఆరోగ్య కేంద్రాలలో పని చేస్తున్న పారిశుద్ధ్య పేషెంట్ కేర్ ఎజెన్సీ వారు కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్యం చేశారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని వాపోయారు. ఆరు నెలలగు వేతనాలు చెల్లించకపోతే కార్మికులు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. పెండింగ్ వేతనాలను తక్షణమే విడుదల చేయకపోతే ఏప్రిల్ 1వ తేదీ నుంచి విధులు బహిష్కరించి నిరవధిక సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మికులు భీమయ్య, జలీల్, నిర్మల, చంద్రకళ, అరుణ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

మామిడి రైతులు విలవిల



పెద్దకొత్తపల్లిలో మామిడి కొనుగోలు కేంద్రానికి వచ్చిన మామిడి కాయలు

పెద్దకొత్తపల్లి: మండలంలోని మామిడి రైతులు దిక్కుతోచనిస్థితిలో పడ్డారు. ఈ సంవత్సరం వాతావరణం అనుకూలిచంకపోవడంతో మామిడి కాపు లేకపోవడంతో తల్లడిల్లిపోతున్నారు. ఐదు సంవత్సరాలుగా మామిడి తోటలు కాపు లేకపోవడంతో కౌలు రైతులు నష్టాలపాలవుతున్నారు. పెట్టుబడి రాక అవస్థలు పడుతున్నారు. మామిడి కాయలకు గిట్టుబాటు ధర లేకపోవడంతో తోటల యజమానులు, కౌలు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పెద్దకొత్తపల్లి, కొల్లాపూర్ ప్రాంతాలలో ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకొని గిట్టుబాట ధర లేక నష్టపోతున్నారు.

ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి



కోడేరులో ఉదయం నిర్మానుష్యంగా మారిన రోడ్డు

కోడేరు: రోజురోజుకు ఎండలు అధికమవుతున్నాయి. గత వారం రోజుల నుంచి భానుడు ప్రతాపం చూపుతున్నాడు. ఉదయం 10 గంటలకే సూర్యుడు భగభగమంటున్నాడు. దీంతో అత్యవసరమైతేనే బయటకు వస్తున్నారు. కొందరు పనులు వాయిదా వేసుకుంటున్నారు. ఇంట్లో కూడా ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మండలంలో రోజురోజుకు ఎండ వేడిమి అధికం కావడంతో మండల ప్రజలు తల్లడిల్లిపోతున్నారు. ప్రతి రోజూ 41 నుంచి 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతోందని అధికారులు పేర్కొన్నారు. ఉదయం 12 గంటల వరకే ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. కూలీలు, రైతులు ఉదయం, సాయంత్రం వేళల్లో పని ముగించుకొని త్వరగా ఇంటిబాట పడుతున్నారు. ద్విచక్రవాహనదారులు తలపై టోపీలు ధరించి ప్రయాణిస్తున్నారు. కాలినడకన వెళ్లేవారు గొడుగు పట్టుకొని వెళ్తున్నారు.

శీతల పానీయాలకు పెరిగిన డిమాండ్

ఎండవేడికి తట్టుకునేందుకు గ్రామీణ ప్రాంతాల్లో శీతలపానీయాలను ఆశ్రయిస్తున్నారు. దీంతో కొబ్బరిబొండాలకు విపరీతమైన గిరాకీ పెరిగింది. ఇదే అదనంగా భావించిన వ్యాపారస్తులు పానీయాలను అధిక ధరలకు విక్రయిస్తున్నారు. చల్లని మజ్జిక తాగి ఉపశమనం పొందుతున్నారు.

ముస్లింలకు ఇఫ్తార్



కల్వకుర్తి: కల్వకుర్తి మండలం తాండ్రలో చారకొండ మండలం జూపల్లి గ్రామానికి చెందిన ముస్లింలకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కాయతి ఆశాదీప్ రెడ్డి శుక్రవారం ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. జూపల్లి మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



కోడేరు: మండల కేంద్రానికి చెందిన కావలి శివ (38) శుక్రవారం మృతి చెందాడు. గతంలో మృతిడి భార్య కూడ మృతి చెందడంతో ఇద్దరు పిల్లలు అనాథలుగా మారారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకుడు దూరెడ్డి సురెందర్‌రెడ్డి, రవిందర్ రెడ్డి, వంశీ, కావలి సుబ్బయ్య, బాలస్వామి, నాగేంద్రం, మాసయ్యలు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మానవతదృక్పథంతో బాధితుడి తల్లి వెంకమ్మకు రూ.25 వేలు ఆర్థికసాయం అందజేశారు.

కల్వకుర్తిరూరల్: మండలంలోని రఘుపతిపేట గ్రామానికి చెందిన రాములు అనారోగ్యంతో మృతి చెందాడు. గ్రామానికి చెందిన రాజు బాధిత కుటుంబ పరిస్థితిని ఆమనగల్ పాపిశెట్టి రాము దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు ఆయన స్పందించి రూ.3 వేలు సమకూర్చారు. శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులకు నగదు అందజేశారు. కార్యక్రమంలో బాలీశ్వర్, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

వీహెచ్‌పీ సేవలు విస్తరిస్తాం



నర్సింహామూర్తితో మండల సభ్యులు

తెలకపల్లి: వీహెచ్‌పీ సేవలు విస్తరిస్తామని ఆ సంస్థ అధ్యక్షుడు బోజనపల్లి నర్సింహామూర్తి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రమైన నాగర్‌కర్నూల్‌కు వచ్చిన నర్సింహామూర్తిని మండల ప్రకండ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూధర్మం కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి మారోజు ఉమాపతి ఆచార్యులు, కిశోర్, కార్యదర్శి శివకృష్ణ, చెన్నబాబు, శివకేశవులు తదితరులు పాల్గొన్నారు.

లీకేజీలను సరి చేయాలి



గుంతకోడూరు సమీపంలో లీకేజైన మిషన్‌భగీరథ పైపులైన్ నీరు

తాడూరు: మండల కేంద్రం మీదుగా గుంతకోడూరు, మేడిపూర్ వరకు ఉన్న మిషన్‌భగీరథ పైపు లైన్ లీకేజీలమయం అయ్యింది. మండల కేంద్రంలో రెండు రోజులుగా నీటి సరఫరా స్తంభించి పోయింది. నీటి సరఫరా గురించి పంచాయతీ కార్యదర్శితోపాటు గ్రామ ప్రత్యేకాధికారికి విన్నవించినా పట్టించుకోవడం లేదు. మండల కేంద్రం నుంచి మేడిపూర్ వరకు వెంకటాపూర్ గేట్ వద్ద లీకేజీ కారణంగా పచ్చిగడ్డి, జమ్ము పెరిగింది. అధికారులకు తెలిసినా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు వాపోయారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి లీకేజీలను సరిచేయడంతో పాటు నీటి సరఫరాపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

మామిడితోటకు గడ్డిమందు పిచికారీ



పెంట్లవెల్లి: మండలంలోని గోపులాపూర్ గ్రామానికి చెందిన రైతు సునిగిరి రాములమ్మ సర్వే నంబర్ 177లో గ్రామ శివారులోని 2 ఎకరాల 4 కుంటల మామిడితోటను సాగు చేశారు. అదే గ్రామానికి చెందిన ఓ రైతు గురువారం అర్ధరాత్రి రాములమ్మకు సంబంధించిన మామిడితోటను గడ్డి మందు పిచికారీ చేశాడు. దీంతో 120 మామిడి చెట్లు ఎండిపోయాయి. మొత్తం రూ.4 లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధిత మహిళా రైతు తెలిపారు. అనంతరం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

బీమా చెక్కు పంపిణీ



వెల్దండ: మండలంలోని కొట్ర గ్రామానికి చెందిన కావటి వరమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. శుక్రవారం ఎల్ఐసీ నుంచి మంజూరైన బీమా చెక్కు రూ.2.60 లక్షలను బ్రాంచ్ మేనేజర్ హరిలాల్ నామిని భర్త కావటి కృష్ణయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా హరిలాల్ మాట్లాడుతూ ఎల్ఐసీ సేవలను గ్రామీణ ప్రాంత ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అనంతరం బాధిత కుటుంబానికి బీమా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ జంగయ్యయాదవ్, ఎల్ఐసీ ఏజెంట్ వెంకటేష్, నాయకులు దశరథం, మల్లేష్, హన్మంత్, వెంకటయ్య, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

బెల్లం ఊట ధ్వంసం



కోడేరు: మండలంలోని సింగాయిపల్లి తండాలో శుక్రవారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. 400 లీటర్ల బెల్లం ఊట పారబోశారు. ఒక్కరిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ హనుమంతు తెలిపారు. సిబ్బంది పాల్గొన్నారు.

గుంతలమయంగా బీటీ రోడ్డు



యత్మాతాపూర్ రోడ్డు

తాడూరు: మండల కేంద్రం నుంచి ఇంద్రకల్ మీదుగా యత్మాతాపూర్, తుమ్మలసూర్ మీదుగా కుమ్మెరకు వెళ్లే ప్రధాన ఆర్‌అండ్‌బీ రోడ్డు యత్మాతాపూర్ సమీపాన దెబ్బతింది. రోడ్డు గుంతలమయంగా మారడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. దశాబ్ద కాలం కిందట బీటీ నిర్మాణం చేపట్టారు. సంబంధిత కాంట్రాక్టర్, అధికారులు నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా బీటీ రోడ్డుపై ఏర్పడిన గుంతలను అధికారులు తాత్కాలిక మరమ్మతు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అలంకారప్రాయంగా ప్రచార బోర్డులు



ఆస్పత్రిలో ఖాళీగా దర్శనమిస్తున్న ప్రచార నోటీసు బోర్డు

అచ్చంపేట రూరల్: అచ్చంపేట ప్రాంతీయ ఆస్పత్రిని పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేశారే తప్పా అధికారులు వసతులు కల్పించడంలో శ్రద్ధ పెట్టడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. అసలు పర్యవేక్షణే చేయడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. మాతా శిశు ఆరోగ్య సంరక్షణ రాష్ట్ర ప్రోగ్రాం ఆఫీసర్ సుమిత్ర బృందం అచ్చంపేట ప్రాంతీయ ఆస్పత్రికి పరిశీలనకు వచ్చినప్పుడు అధికారుల నిర్లక్ష్యం బహిర్గతమయ్యింది. ఆస్పత్రికి జనరల్ చెకప్‌కోసం వచ్చే ఓపీ పేషంట్లు పేర్లు నమోదు చేసుకునే ప్రదేశంలో పెద్ద సమాచార నోటీసు బోర్డును ఏర్పాటు చేశారు. ఆ బోర్డులో ఎలాంటి సమాచారం లేకుండా ఖాళీగా దిష్టిబొమ్మలా దర్శనమిస్తోంది. అలాగే ప్రతి శుక్రవారం ఓబీజీ స్కానింగ్ చేస్తామని ఇంగ్లీషు అక్షరాలతో ఆస్పత్రి ప్రదేశాలలో రాసి ఉన్నప్పటికీ గర్భిణులకు స్కానింగే చేయలేదు. సమాచార బోర్డులు ఖాళీగా కన్పించకుండా ఆస్పత్రికి సంబంధించిన గణాంక వివరాలు నమోదు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించినా స్థానిక అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.

మహిళల హక్కుల సాధనకు ఐక్య పోరాటాలు

పెంట్లవెల్లి: మహిళల హక్కుల కోసం ఐక్యంగా పోరాటాలు చేద్దామని ఐద్వా మండల అధ్యక్షురాలు ఆదిలక్ష్మి శుక్రవారం పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న మహిళా వ్యతిరేక విధానాలపై పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. మహిళా రిజర్వేషన్లు అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అయ్యాయన్నారు. అనంతరం 11 మందితో ఐద్వా కమిటీని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో లావన్య, సీతమ్మ, అరుణ తదితరులు పాల్గొన్నారు.

కంకర వేశారు బీటీ మరిచారు



కోడేరు నుంచి పస్పులకు వెళ్లే దారి ఇలా..

కోడేరు: మండలంలోని నాగులపల్లి నుంచి కోడేరు, పస్పుల వరకు నెలరోజుల కిందట డబుల్ రోడ్డు నిర్మాణం కోసం కాంట్రాక్టర్‌లు కంకర వేసి అలాగే వదిలేశారు. నిర్మాణ పనులు చేపట్టకపోవడంతో ప్రయణికులు, ద్విచక్రవాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రివేళ బిక్కుబిక్కు మంటూ ప్రయాణిస్తున్నారు. పలువురు ప్రమాదాలబారిన ఘటనలు ఉన్నాయి. కాంట్రాక్టర్ విన్నవించినా పట్టించుకోకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికై న అధికారులు స్పందించి డబుల్ రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామ స్తులు కోరుతున్నారు.

ఆముదంసాగుపై రైతన్న ఆసక్తి



అవగాహన కల్పిస్తున్న ఏఈఓ

మన్ననూర్: అమ్రాబాద్ మండలంలోని అన్ని గ్రామాల్లో కోతులు, అడవి పందుల బెడద అధికమైంది. దీనికి తోడుగా అనుకూల వాతావరణంతో ఏ పంట సాగు చేసిన ఆశించిన స్థాయిలో లాభాలు రాకపోగా నష్టాలు వస్తున్నాయి. దీంతో మూడేళ్లుగా ప్రత్యేకించి యాసంగిలో ఆముదం పంటను రైతులు సాగు చేస్తున్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందడానికి ఇక్కడి వాతావరణంలో అనుకూలంగా ఉండటంతో ఆముదంసాగుపై ఆసక్తి చూపుతున్నారు. వెంకటేశ్వర్లబావి గ్రామానికి చెందిన రైతు సూరం దామోదర్ రెడ్డి కొంత కాలంగా ఆముదం పంట సాగుచేస్తూ లాభాలు గడిస్తున్నారు. గత 2022లో పాలెం ఆర్ఏఆర్ఎస్ వారు ఇచ్చిన పీసిహెచ్-111అనే రకంను సాగు చేసి అధిక ఆదాయాన్ని పొందాడు. ఈ ఏడాది 5 ఎకరాల్లో ఆముదం పంట సాగు చేశాడు.

ఆర్‌ఎస్పీ గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కొల్లాపూర్: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ గెలుపే లక్ష్యంగా పనిచేద్దామని ఇటీవల బీఆర్ఎస్‌ను వీడీ బీఆర్ఎస్‌లో చేరిన నాయకులు, కార్యకర్తలు నిర్ణయం తీసుకున్నారు. శుక్రవారం కొల్లాపూర్‌లోని మాజీఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి నివాసంలో ఆయన అనుచరులతో సమావేశం అయ్యారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచార అంశాలపై చర్చించారు. సమావేశంలో నాయకులు రాంచందర్‌యాదవ్, కారంగి బ్రహ్మయ్య, పరమాల ప్రకాష్, మధు, విష్ణువర్ధన్, రవి, శివకుమార్, రాజు, మల్లయ్య తదితరులున్నారు.

శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయం



వ్యాపారులతో మాట్లాడుతున్న ఎస్ఐ

లింగాల: శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తున్నామని ఎస్ఐ జగన్మోహన్ అన్నారు. శుక్రవారం పోలీసుస్టేషన్ ఆవరణలో వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ వ్యాపారులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. మండల కేంద్రంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలని కోరారు. మండల కేంద్రంలోని ప్రధాన కూడళ్లలో కెమెరాలను ఏర్పాటు చేయడం వలన నేరాల నియంత్రణకు ఎంతో దోహదం చేస్తాయన్నారు. దొంగతనాలు, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామన్నారు. గ్రామ పంచాయతీలో సీసీ కెమెరాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.